సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2024



సప్తవర్ణ సోయగం

వినీల ఆకాశంలో మంగళవారం సూర్యోదయం వేళ ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. మంచు తుంపరలు కురిసే సమయంలో మేఘాలు సప్తవర్ణాలతో అబ్బురపరిచాయి. ఈ అపురూప దృశ్యం కొత్తపాడేరు, గొందూరు ప్రాంతాల్లో ఆవిష్కృతమైంది. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- ఎనిమిది టిప్పర్లు సీజ్



అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

ఎటపాక: మండలంలోని గుండాల **ఇసుక స్టాక్** పాయింట్ నుంచి ఇసుక అక్రమ **రవాణాకు చిం**తూరు పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఎటువంటి వేబిల్లులు లేకుండా పక్క రాష్ట్రాలకు ఎనిమిది టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు అప్రమత్తయ్యారు.చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాలతో సోమవారం రాత్రి ఎస్‌ఐ రమేష్, తహసీల్దార్ చిరంజీవి చట్టి వద్ద నిఘా ఏర్పాటు చేశారు. అటుగా వస్తున్న ఎనిమిది ఇసుక టిప్పర్లను నిలిపి తనిఖీ నిర్వహించారు. వారి వద్ద ఎటువంటి వేబిల్లులు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు టిప్పర్లు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అధిక లోడు, అతివేగంగా వెళ్తున్న లారీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ప్రొఫెసర్ సాయిబాబాది కేంద్ర ప్రభుత్వ హత్యే..!



గీతాలు ఆలపిస్తున్న ప్రజాగాయకుడు దేవిశ్రీ

సీతమ్మధార (: మానవ హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబా మరణం కేంద్ర ప్రభుత్వ హత్యేనని ప్రజా గాయకుడు, పర్యావరణ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి దేవిశ్రీ ఆరోపించారు. సాయిబాబా మృతికి సంతాపంగా జీవీఎంసీ గాంధీపార్కులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సాయిబాబా ఉద్యమ స్ఫూర్తిపై పలు గీతాలను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా జీవితకాలం నమ్మిన సిద్ధాంతాల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేశారని కొనియాడారు. కేంద్రప్రభుత్వం అకారణంగా పదేళ్లు ఆయనను జైలు జీవితం అనుభవించేలా చేసిందని ఆక్షేపించారు. న్యాయస్థానం ఆయనను నిర్దోషిగా విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఇది కేంద్ర ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి, పాటల తూటా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ, సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ప్రొఫెసర్ సాయిబాబా అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్రప్రభుత్వాన్ని గడగడలాడించిన చరిత్రను మర్చిపోరాదన్నారు.

మహిళా కళాశాలలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

దాబాగార్డెన్స్(విశాఖ): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, ఎంకామ్, ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులకు సంబంధించి ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి ఫలాలు.. శాంతి సుమాలు

నాడు మావోయిస్టులు, పోలీసుల బూట్ల చప్పుళ్లు.. నేడు ప్రగతి బాటలు

బుంగాపుట్టు.. బూసిపుట్టు.. రంగబయలు పంచాయతీల్లోని **64 గిరిజన గ్రా**మాలు.. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో **ఉన్న ఇవి ఒకప్పు**డు మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలు. **పోలీసులు బూ**ట్ల చప్పుళ్లు.. మావోయిస్టుల విధ్వంసాలతో **అలజడి ఉండే** ఈ గ్రామాల్లో ఇప్పుడు ప్రశాంత వాతావరణం **నెలకొంది. అల్లూ**రి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లా **ఏర్పాటుతో పథ**కాలు, పాలన అందుబాటులోకి వచ్చాయి. **ఇప్పుడు అభివృ**ద్ధిపథంలో నడుస్తున్నాయి. మావోయిస్టుల **ప్రభావం పూర్తి**గా తగ్గడంతో శాంతి సుమాలు విరబూస్తున్నాయి.

- **బూసిపుట్టు, రంగబయలు, బుంగాపుట్టు ప్రాంతాలు ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డా**
- **రోడ్లు లేక గుర్రాలే రవాణా** సాధనాలు
- ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో చేరువైన పాలన
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుబాటులోకి వచ్చిన మౌలిక వసతులు
- సహాయ కార్యక్రమాలతో గిరిజనులకు చేరువవుతున్న పోలీసులు
- కనిపించని మావోయిస్టుల ప్రభావం
- సరిహద్దు గ్రామాల్లో ప్రశాంత జీవనం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జోడిగుమ్మ వెళ్లేందుకు కొండల మధ్య నిర్మించిన రహదారి

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దులోని బుంగాపుట్టు.. బూసిపుట్టు.. రంగబయలు పంచాయతీల్లోని 64 గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండేవి. సరియైన రహదారులు లేకపోవడంతో రోగులను తరలించేందుకు డోలీలే దిక్కు. గుర్రాలే రవాణా సాధనాలు. మైళ్ల దూరం కాలినడకన వెళ్లి ఊట గెడ్డ నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన, పథకాలను చేరువ చేసింది. మౌలిక వసతులు కల్పించడంతో వారికి అవస్థలు తప్పాయి.

పక్కా రహదారులు

బుంగాపుట్టు పంచాయతీ కేంద్రానికి రూ.21 కోట్లతో సుమారు 26 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ మార్గంలో రూ.9కోట్లతో బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి.

- బూసిపుట్టు పంచాయతీ కేంద్రం మీదుగా రూ.13కోట్లలో ఒడిశా సరిహద్దు వరకు తారు రోడ్డు నిర్మించారు. దీంతో సుమారు 80 గ్రామాలకు రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.
- రంగబయలు పంచాయతీ కేంద్రానికి రూ.20కోట్లతో తారు రోడ్డు నిర్మించడంతో 22 గ్రామాలకు రవాణా సమస్య పరిష్కారమైంది. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు వారపు సంతకు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వారి ఆర్థికపరిస్థితి మెరుగు పడింది.

అందుబాటులో ఇంటర్నెట్ సేవలు

సెల్ టవర్ల నిర్మాణంతో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో సెల్ సిగ్నళ్ల కోసం గిరిజనులు కొండలు,గుట్టలు ఎక్కాల్సి వచ్చేది. అత్యవసర పరిస్థితుల్లో 108కు, ఆస్పత్రులకు సమాచారం అందించేందుకు ఇబ్బందులు పడేవారు. టవర్ల ఏర్పాటుతో ఇప్పుడు సమాచారం క్షణాల్లో చేరిపోతోంది.

తగ్గిన అలజడి

బుంగాపుట్టు,బూసిపుట్టు,రంగబయలు పంచాయతీల్లో గత ఐదేళ్లలో మావోయిస్టుల హడావుడి తగ్గింది. సరిహద్దు ప్రాంతాల్లో ఒడిశా ప్రభుత్వం ఆరు చోట్ల పోలీసు ఆవుట్ పోస్టులు ఏర్పాటుచేసింది. పోలీసులు నిత్యం సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించడం వల్ల మావోయిస్టులు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

- జనమైత్రి పేరుతో స్థానిక పోలీసులు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ గిరిజనులకు చేరువయ్యారు. దీని ప్రభావం మావోయిస్టుల ఇన్‌ఫార్మర్ వ్యవస్థపై ప్రభావం చూపింది. గిరిజన యువతను ఆకర్షించేలా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.సీఆర్‌పీఎఫ్ పోలీసులు సివిల్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సామగ్రి, దుస్తులు పంపిణీ చేస్తూ గిరిజనులకు చేరువయ్యారు.

విధ్వంసాలకు చెక్

గతంలో పోలీసుల ఇన్‌ఫార్మర్ నెపంతో సరిహద్దు గ్రామాల్లో హత్యలు జరుగుతూ ఉండేవి. దీంతో గిరిజనులు గ్రామాలను వదిలి బయటకు వచ్చేందేకు భయపడాల్సిన పరిస్థితి. 2010– 2019 మధ్య పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో 39 మందిని మావోయిస్టులు హతమార్చారు. ఆ తరువాత నుంచి ఇప్పటి వరకు బుంగాపుట్టు,బూసిపుట్టు,రంగబ యలు పంచాయతీల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. గత మూడేళ్లలో సుమారు 86 మంది మావోయిస్టు సానుభూతి పరులు పోలీసుల ఎదుట లొంగిపోవడం గమనార్హం.

గిరిజనాభివృద్ధే లక్ష్యం



“ఏవోబీలో గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోంది. గిరిజనులతో మమేకం అవుతూ వారికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాం. సెల్ టవర్లు, రహదారులు అందుబాటులోకి రావడంతో గిరిజనుల రవాణా కష్టాలు, సిగ్నల్ కష్టాలు తప్పాయి. గిరిజనులకు పోలీసు శాఖ ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది.” – **ధీరజ్**, ఏఎస్పీ, పాడేరు



బూసిపుట్టు పంచాయతీలో గ్రామాలకు నిర్మించిన రోడ్డు



రోడ్లు నిర్మించకముందు గుర్రాలపై బోసిపుట్టు గిరిజనుల రాకపోకలు



అభివృద్ధిపథంలో కొండల కొజిరిగూడ గ్రామం

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన

విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

అరకులోయ టౌన్: విద్యార్థులకు అర్థమయ్యే రీతి లో పాఠాలు బోధించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ (విశాఖ) విజయభాస్కర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులను కొట్టడం, భయపెట్టకుండా విద్యను అందించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు రావాలన్నా, వారు ఉన్నత స్థాయికి ఎదగాలన్నా ఉపాధ్యాయులు పాఠాలు బోధించే విధానం, పిల్లలతో వారి ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించి, విద్యాప్రమాణాల మెరుగుకు కృషిచేయాలని సూచించారు. బయోమెట్రిక్, ఫేషియల్ అటెండెన్స్ విధిగా నిర్దేశిత సమయానికి వేసుకోవాలని సూచించారు. విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందించాలని, ఎస్‌ఎస్‌సీ పరీక్షలకు ఇప్పటినుంచి విద్యార్థులను సిద్ధ పరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఈవో వంతాల త్రినాథరావు, హెచ్‌ఎం టి.మోహనరావు పాల్గొన్నారు.

కాఫీ కొనుగోలుకు ఏర్పాట్లు

జీసీసీ పాడేరు డీఎం సింహాచలం



గుమ్మసిరగంపుట్టులో రైతులతో మాట్లాడుతున్న జీసీసీ డీఎం సింహాచలం

ముంచంగిపుట్టు: గిరిజన సహకార సంస్థ ద్వారా రైతుల నుంచి కాఫీ కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆ సంస్థ పాడేరు డీఎం డి.సింహాచలం తెలిపారు. మండలంలోని పనసపుట్టు పంచాయతీ కడుతుల, బంగారుమెట్ట పంచాయతీ సోలగంపుట్టు, కించాయిపుట్టు పంచాయతీ గుమ్మసిరగంపుట్టు గ్రామాల్లో కాఫీ కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులంతా సేకరించిన కాఫీ పంటను తమ సంస్థకు విక్రయించాలని, కాఫీ రకాన్ని బట్టి ధరలను నిర్ణయించినట్టు వివరించారు. కాఫీ అరెబికా పార్చ్‌మెంట్ రకానికి రూ.285, అరెబిక్ చెర్రీ రకానికి రూ.150, రొబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.80 చొప్పున ధర చెల్లిస్తామని తెలిపారు. కాఫీ ఉత్పత్తులను జీసీసీకి విక్రయించి మంచి ఆదాయం పొందాలని ఆయన కోరారు. ప్రైవేట్ వ్యాపారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో కాఫీ సేల్స్‌మెన్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంప్రదాయ పంటలను సాగు చేయండి

- గిరిజనులతో ఎస్పీ అమిత్ బర్దర్
- గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని సూచన



జామిగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్



డ్రోన్‌తో తీసిన గంజాయి సాగు ఫొటోలను పరిశీలిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

పెదబయలు/ముంచంగిపుట్టు: గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండి గిరిజనులు సంప్రదాయ పంటలను సాగు చేయాలని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. పెదబయలు మండలం జామిగూడ పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం భూసిపుట్టు పంచాయతీల్లోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. జామిగూడ పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గిరిజనులతో మమేకమయ్యారు. గ్రామాలలో పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఎస్పీ దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. గంజాయి వల్ల కలిగే కష్టాలపై గిరిజనులకు ఎస్పీ వివరించారు. ఆర్థికంగా లాభాలు వచ్చే పంటలపై పెట్టాలని గిరిజనులకు సూచించారు.అనంతరం బూసిపుట్టు వారపు సంతలో గిరిజనులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్న ఆయన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రూడకోట ఆవుట్ పోస్టును సందర్శించిన ఆయన సరిహద్దులో పరిస్థితులపై ఆరా తీశారు.నిత్యం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గంజాయి రవాణాపై తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రధాన జంక్షన్ల వద్ద వాహనాల రాకపోకలపై దృష్టి పెట్టి గంజాయి రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీసులకు సూచించారు. డ్రోన్‌తో రూడకోట సరిహద్దు గ్రామాల్లో గంజాయి పంటలపై తీసిన ఫొటోలు, వీడియోలను ఎస్పీ పరిశీలించారు. తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పెదబయలు ఎస్‌ఐ కె.రమణ, ఆయా స్టేషన్ల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాంతులు, విరేచనాలతో 12 మందికి అస్వస్థత

- అరకు ఏరియా ఆస్పత్రికి తరలింపు
- ఒకరి పరిస్థితి విషమం



ఆస్పత్రిలో కోలుకుంటున్న గిరిజనులు



చికిత్స పొందుతున్న మహేష్



చికిత్స అనంతరం కోలుకున్న గ్రీష్మ

అరకులోయ రూరల్: మండలంలో మాడగడలో వాంతులు, విరేచనాలతో 12 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో జల్ల అప్పలస్వామి, మహేష్, దాడి రాజు, గ్రీష్మ, భవాని, రమేష్, లలిత, ప్రిన్స్, రాములమ్మ, వెంకటలక్ష్మి, బాబుజ్జీ తదితరులను సోమవారం రాత్రి అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. భవాని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్యసిబ్బంది తెలిపారు. తాగునీరు కలుషితం కావడం వల్లే అస్వస్థతకు గురయ్యారని వారు పేర్కొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన బుధవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటల నుంచి 3, 4వ సంఘ సమావేశాలు, 12 గంటల నుంచి 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిందే

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం : ఏజెన్సీలో టూరిజం బోట్లు, రిసార్టుల యజమానులు ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహచలం ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి టూరిజం ప్రాంత అధికారులు, బోట్లు, రిసార్టుల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీపట్నం మండలం పాపికొండలు పర్యాటక కేంద్రంలో తిరిగే టూరిస్ట్ బోట్లు టూరిజం శాఖకు సంబంధించి అనుమతులు పక్కాగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు టూరిజం బోట్లు ఉదయం 9.45 గంటలకు బయలుదేరి తిరిగి సాయంత్రం 5.15 గంటలకు చేరుకోవాలని బోట్ల యాజమాన్యాలను ఆదేశించారు. టూరిజం బోట్లలో రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని సూచించారు. టూరిజం ప్రాంతాలకు సంబంధించిన మండలాల్లో అధికారులతో పర్యాటక భద్రత కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పర్యాటక బోటులో భద్రతకు సంబంధించి కరపత్రాలు తయారు చేసి టూరిస్టులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 17 వరకు పర్యాటక ప్రాంతాల్లో సందర్శన నిలిపివేసినట్టు పీవో తెలిపారు.

కూనవరం అటవీ రేంజ్‌లో పులి సంచారం






దూగుట్ట వద్ద అటవీ శాఖ అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు

రెండు చోట్ల పాదముద్రలు గుర్తించిన అధికారులు

కూనవరం: కూనవరం అటవీ రేంజ్ పరిధిలోని చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయతీ తాటిలంక గ్రామంలో సోమవారం మధ్యాహ్నం పెద్దపులి అడుగుజాడలను గ్రామస్తులు గుర్తించారు. వెంటనే అటవిశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సబ్ డీఎఫ్‌వో కేవీఎస్ రాఘవరావు సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అవి పులి పాదముద్రలుగా ఆయన నిర్ధారించారు. అలాగే మంగళవారం కూనవరం మండలం దూగుట్ట ప్రాంతంలో పెద్ద పులి అడుగులు గుర్తించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. చింతూరు డీఎఫ్‌వో బబిత గోదావరి పరివాహక ప్రాంతానికి సమీపంలో ఉన్న దూగుట్ట గ్రామానికి వెళ్లి ఆ అడుగులను పరిశీలించారు. అవి కూడా పులి పాదముద్రలుగా ఆమె నిర్ధారించారు. అయితే ఈ రెండు చోట్ల లభ్యమైన పాదముద్రలు ఒకటేనా కాదా అనే దానిపై అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 30 మంది అటవీ సిబ్బంది పులి సంచారంపై గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎఫ్‌ఆర్వో కరుణాకర్ తెలిపారు. అలాగే అటవీ ప్రాంతంలో ఉన్న బోదునూరు, పాలగూడెం, మెతమవరం, తాటిలంక, రామచంద్రాపురం, కన్నాపురం గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పశువులకు అడవి జంతువుల నుంచి ప్రమాదం జరిగినట్టయితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కాన్ఫరెన్సు
- బాధ్యతగా పనిచేయాలని సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : అధికారులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన పంచాయతీ అధికారులు, గృహ నిర్మాణ, విద్య, వైద్యారోగ్య, గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. క్లాప్ మిత్ర బకాయిలు తక్షణమే చెల్లించాలని సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. దుకాణాల పరిసరాలను సంబంధిత యజమానులతో శుభ్రం చేయించాలన్నారు. ఐసీడీఎస్ సేవల్లో పురోగతి సాధించాలన్నారు. బాలికల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. టేక్ హోం రేషన్‌ను పక్కాగా పంపిణీ చేయాలన్నారు. సీడీపీవోలు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేస్తామన్నారు. ఎంపీడీవోల పనితీరుపై ఆయన ఆగ్రహానికి గురయ్యారు. వారానికి నాలుగు గ్రామ సచివాలయాలను సందర్శించాలని వారికి సూచించారు. ప్రత్యేకాధికారుల నివేదిక ప్రకారం గ్రామ సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసి బిల్లులు తక్షణమే చెల్లించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే 22,740 జగనన్న గృహాలు మంజూరు కాగా, మరో 2623 మంజూరు చేస్తామన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ అమలులో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు ప్రతి పూట అందించే మెనూకు ఫొటోలు తీసి సంబంధిత గ్రూపులో పంపించాలన్నారు. ఉపాధ్యాయులు ముఖ హాజరు తక్కువగా అమలు చేస్తున్నారని ఉదయం 10 గంటల లోపే ముఖ హాజరు వేయాలన్నారు. దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లి పాఠశాలలకు తిరిగి వస్తున్న విద్యార్థులకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు అన్ని పీహెచ్‌సీలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సమీప పాఠశాలల టీచర్లతో భర్తీ చేయాలన్నారు.ఈ సమావేశంలో డీపీవో లవరాజు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ బాబు, టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజనీ, డీఎల్పీవో కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త యాప్‌తో చిక్కులు

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు కొత్త యాప్ రూపకల్పన
- ఆక్రమిత భూముల వివరాలు అప్‌లోడ్ చేయాలని వీఆర్వోలకు ఆదేశాలు
- వారం రోజుల్లో ఆక్రమణదారులకు నోటీసుల జారీ
- ఈ ప్రక్రియతో ఆక్రమణదారులకే లబ్ధి అంటూ విమర్శలు

మహారాణిపేట(విశాఖ): భూ ఆక్రమణల యాప్ రెవెన్యూ అధికారులకు కొత్త చిక్కులు తీసుకొచ్చేలా ఉంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రూపొందించిన ఈ యాప్‌తో ఆక్రమణదారులకు హక్కులు కల్పించే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియను మరింత కఠినతరం చేయడంతో పాటు కోర్టు కేసులు కూడా వెంటాడే పరిస్థితులు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం జిల్లా యంత్రాంగం ఇటీవల ఒక యాప్‌ను తీసుకొచ్చింది. ప్రతీ వీఆర్వో తన పరిధిలో ఆక్రమిత ప్రభుత్వ భూముల వివరాలను తప్పనిసరిగా ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫొటో, ఆక్రమణదారుడి వివరాలు, సర్వే నంబర్, ఇతర వివరాలు ఇందులో నమోదు చేస్తే.. ఆటోమేటిక్‌గా ఆక్రమణదారుడికి నోటీసు సిద్ధమవుతుంది. ఈ నోటీసును సంబంధిత వీఆర్వో వారం రోజుల్లోగా ఆక్రమణదారుడికి అందజేయాలి. 15 రోజుల తర్వాత మరోసారి నోటీసు జారీ చేసి.. దానిపై ఆక్రమణదారుడి నుంచి వివరణ తీసుకోవాలి. వారి వివరణ సంతృప్తిగా లేదని భావిస్తే నాలుగు రోజుల్లో ఆ నిర్మాణాలు తొలగించాలి. ఈ ఉద్దేశంతోనే ఈ యాప్‌ను అధికారులు రూపొందించారు. ఈ మేరకు జిల్లాలోని వీఆర్వోలు అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ఈ యాప్‌లో నమోదు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. గ్రేడ్-1, గ్రేడ్-2, సచివాలయం వీఆర్వోలు మొత్తం 336 మంది ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. 10 రోజుల వ్యవధిలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్న నిబంధన కూడా ఉంది. అయితే ఈ కార్యక్రమం ఆక్రమణదారుడికి లబ్ధి చేకూర్చేలా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

గ్రామ/వార్డు సర్వేయర్లు ఎక్కడ?

భూమి సరిహద్దులను కచ్చితంగా నిర్ణయించడంలో సర్వేయర్ల పాత్ర కీలకం. ప్రభుత్వ భూముల కోసం వీఆర్వోతోపాటు సర్వేయర్‌కు పూర్తి అవగాహన ఉంటుంది. ఒక్క వీఆర్వో వల్ల పెద్దగా ప్రయోజనం ఉండే అవకాశం లేదు. అంతేకాకుండా వీఆర్వో ఈ సమాచారాన్ని ఆక్రమణదారుడికి ఇచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాల్లో సర్వేయర్లు అందుబాటులో ఉన్నారు. కానీ ఈ ప్రక్రియలో సర్వేయర్లను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదు.

గతంలో ఇలాంటి పద్ధతి ఉందా?

ప్రభుత్వ భూముల ఆక్రమణ ఎక్కడో ఓ చోట నిత్యం జరుగుతూనే ఉంటుంది. ఇప్పటివరకు ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా తొలగిస్తున్నారు. అడంగల్‌లోని గానీ ఇతర రెవెన్యూ రికార్డుల్లో ఆక్రమణదారుడి పేరు నమోదు చేసే పరిస్థితి ఎప్పుడూ లేదు. కానీ ఈ కొత్త పద్ధతి వల్ల ఆక్రమణదారులకు చాలా అవకాశాలు కల్పించినట్లవుతుందని పలువురు అంటున్నారు.

నోటీసులతో ఆక్రమణదారుడికే లబ్ధి

ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేయడం వల్ల వారికే లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఈ నోటీసులతో వారు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. తద్వారా ఆక్రమణదారుడికి చేతికి మరో అవకాశం కల్పించేటట్టు అవుతుంది. ఫలితంగా ఆక్రమణలను తొలగించడం కష్టతరం అవుతుంది.

ఏం చేయాలి?

ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఈ యాప్ మంచి ప్రయత్నమే కానీ.. యాప్‌లోని కొన్ని లోపాలను సరిచేయడం చాలా ముఖ్యం. అప్పుడే ఈ యాప్ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. 'ప్రతి వీఆర్వోకు ఒక సర్వేయర్‌ను కేటాయించి, భూమి సరిహద్దులను కచ్చితంగా నిర్ణయించే బాధ్యతను అప్పగించాలి. నోటీసుల కాలవ్యవధి, వివరణ కోరే విధానం తదితర అంశాలపై పునఃసమీక్ష చేయాలి. ఆక్రమణదారులకు అధిక అవకాశాలు లభించకుండా చూడాలి. ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టవిరుద్ధమని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. రెవెన్యూ, పోలీసు శాఖ, స్థానిక సంస్థల మధ్య సమన్వయం పెంచి, ఆక్రమణలను తొలగించే చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలి.' అని పలువురు సూచిస్తున్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

- గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'
- పంటల సాగు, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన



పెదవలసలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొయ్యూరు: రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని చింతపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) జాహ్నవి సూచించారు. గుమ్మనివానిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులపైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుందన్నారు. ఈ పంట సమోదులో ఎలాంటి మార్పులు జరిగినా దాన్ని సరిచేసుకునే అవకాశం సోషల్ ఆడిట్ ద్వారా ఉందన్నారు. ఏవో ఉమాదేవి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచాల్సి ఉందన్నారు. పాడేరు డీఆర్‌సీ అధికారి విజయలక్ష్మి సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. పశువైద్యాధికారి దుర్గప్రసాద్, సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు

గూడెంకొత్తవీధి: రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని ఏవో మదుసూధన్ రావు కోరారు. పెదవలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగులో మెలకువలు పాటిస్తే తెగుళ్లను నివారించి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. అదే విధంగా వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేయాలని సూచించారు.వరిలో చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు.సర్పంచ్ కృష్ణారావు మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించాలని కోరారు.

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.శ్రీనివాసబాబు అన్నారు.మండలంలో గల దొడిపుట్టు పంచాయతీ కేంద్రంలో పెదగూడ పంచాయతీ బాకుబెండ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు మాట్లాడుతూ గిరిజన రైతులు సాగులో పురుగుల మందు వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, వీటి వాడకం వల్ల పంటలకు నష్టాలు కలుగుతాయన్నారు.సేంద్రియ ఎరువులు వినియోగంతో మంచి దిగుబడి పొందవచ్చన్నారు.ఉద్యానవన అధికారి శరణ్య మాధురి, వీహెచ్‌ఏ మోహన్, జెవీవోలు అనురాధ, యమున, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది, అధిక సంఖ్యల్లో రైతులు పాల్గొన్నారు.



గుమ్మనివానిపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ జాహ్నవి, ఏవో ఉమాదేవి తదితరులు



బాకుబెండలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు

భక్తిశ్రద్ధలతో మత్స్యమాడుగులమ్మ పండగ



మత్స్యమాడుగులమ్మ ఆలయ సన్నిధిలో ఆయుధ పూజ నిర్వహిస్తున్న పూజారి దొర

జి.మాడుగుల: మండల కేంద్రంలో గంతకొండపై కొలువై ఉన్న, మత్స్యరాస వంశీయుల ఇలవేల్పు మత్స్యమాడుగులమ్మ దసరా పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జి.మాడుగులలో గల మత్స్యరాస వంశీయుల పూర్వీకుల నుంచి కేలండర్‌లో వచ్చే విజయ దశమి పండుగ అనంతరం వచ్చే మొదటి మంగళవారం మత్స్యమాడుగులమ్మ దసరాను ఆయుధపూజగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. వేడుకలో భాగంగా స్థానిక దివంగత మాజీ ఎంపీ మత్స్యరాస మత్స్యరాజు స్వగృహం నుంచి పూర్వీకులు వినియోగించిన నాటు తుపాకీ, ఖడ్గాలను డప్పు వాయిద్యాలతో మత్స్యరాస వంశీయులు, భక్తులు గ్రామ పురవీధుల్లో ఊరేగించి, మాడుగులమ్మ తల్లి అమ్మవారి సన్నిధికి చేర్చారు. గిరిజన సంప్రదాయబద్ధంగా గిరిజన పూజారి మంత్రోచ్చరణతో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు వచ్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో బంధువులు, స్నేహితులు విచ్చేయడంతో సందడిగా మారింది.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



రాజవొమ్మంగిలో అవగాహన కల్పిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ నరసింహమూర్తి



గంగవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ భూషణం, విద్యార్థులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

రాజవొమ్మంగి: సమాజానికి, వ్యక్తిగత ఆరోగ్యానికి చేటు తెచ్చే డ్రగ్స్‌కు యువతీ యువకులు దూరంగా ఉండాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ నరసింహమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసుకు తెలియజేయాలని, పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సంకల్పం కరపత్రాలను పంపిణీ చేశారు. జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ చిన్నబాబు నేతృత్వంలో మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గంగవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాల అనర్థాలపై విద్యార్థులకు ఎస్‌ఐ డి.భూషణం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు వల్ల కలిగే అనర్థాలపై పోస్టర్‌లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ కె.కృష్ణ, ఏఎస్‌ఐ రజాక్, పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: నిమ్మలపాలెంలో సీఐ వెంకటరమణ మంగళవారం గిరిజనులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు. సారా, గంజాయి వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు.

జంతువుల వేట కోసం ఎవరు విద్యుత్ తీగలు అమర్చినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కొయ్యూరు గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్‌ఐ నాగార్జున పాల్గొన్నారు.

పాయకరావుపేట యువతికి ఆలిండియా 127వ ర్యాంకు



లక్ష్మీ ప్రహర్ష ప్రతిభ

పాయకరావుపేట: కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) నేషనల్ ఎలిజిబిటీ టెస్టు ఫలితాల్లో పాయకరావుపేటకు చెందిన కొసిరెడ్డి లక్ష్మీ ప్రహర్ష ఆలిండియా 127వ ర్యాంకు సాధించింది. జూలై 25, 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా 187 నగరాల్లో 348 కేంద్రాల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన ఈ పరీక్షకు 2.25 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో జేఆర్‌ఎఫ్ అర్హత సాధిస్తే సీఎస్ఐఆర్ పరిధిలోని రీసెర్చ్ సెంటర్లలో, యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. వర్సిటీలు, లేదా డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హులవుతారు. ప్రస్తుతం లక్ష్మీ ప్రహర్ష ఫిట్జి ఇంటర్నేషనల్ ఢిల్లీలో ఫిజిక్స్ ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఫిజిక్స్ విభాగంలో ఐఐటీ, ఎన్ఐటీ లేదా సెంట్రల్ యూనివర్సిటీ నుంచి రీసెర్చ్ చేసి డాక్టరేట్ తీసుకుని ప్రొఫెసర్‌గా స్థిరపడాలని తన ధ్యేయంగా పేర్కొన్నారు. ఆమె తండ్రి డాక్టర్ కోసిరెడ్డి వీర్రాజు విజయవాడలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.వి.ఈ.ఎల్. నాయుడు అభినందనలు తెలియజేశారు.

కుటుంబం చెంతకు వివాహిత



మహిని పాడేరులో ఆమె కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం(విశాఖ): భర్త వేరే పెళ్లి చేసుకోవడంతో ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన పాడేరుకు చెందిన భగత కులానికి చెందిన వివాహితను ఏయూటీడీ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం ముంచంగిపుట్టు మండలం, దారెల పంచాయతీ, రంగలసింగి గ్రామానికి చెందిన సుక్రీవ్ మహాదేవ్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అతని కుమార్తె కె. మహికి పెళ్లి చేసి పంపించాడు. ఆమె భర్త ఆమెతో నిత్యం గొడవ పడటమే కాకుండా కుమార్తెతో సహా కన్నవారి ఇంట్లో వదిలిపోయాడు. దీంతో ఆమె తన 5 ఏళ్ల కూతురిని తల్లిదండ్రుల వద్ద వదిలిపెట్టి విశాఖపట్నం వచ్చేసింది. రైల్వే స్టేషన్‌లో రెస్క్యూ చేస్తున్న సమయంలో ఆమెను గుర్తించిన ఏయూటీడీ సిబ్బంది ఆమెను టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ మహిళా షెల్టర్‌కు తరలించారు. అక్కడి నుంచి ఆమె రెండు సార్లు తప్పించుకు పోయేందుకు ప్రయత్నించడంతో టూటౌన్ పోలీసులు ఆమెను తీసుకువచ్చారు. ఆమెకు ఒడియా భాష మాత్రమే రావటంతో పాడేరులో పని చేస్తున్న ఆదివాసీ మిత్ర సంస్థ డైరెక్టర్ మన్మథరావుతో మాట్లాడించి ఆమె పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆమె తల్లిదండ్రుల వివరాలు తెలియటంతో ఆమెను కారులో పాడేరు తీసుకెళ్లి తండ్రికి, గ్రామ అధ్యక్షుడు, ఆదివాసీ నాయకులైన పాంగి పాండులకు మంగళవారం అప్పగించినట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

అరకులోయ రూరల్: మండలంలో పెదలబుడు మేజర్ పంచాయతీ పానిరంగిని గ్రామ శివారు ప్రాంతం రైల్వే ట్రాక్ వద్ద పానిరంగిని గ్రామనికి చెందిన పవన్‌కుమార్, దీనకుమార్, ప్రకాష్ ల వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు అరకులోయ సీఐ హిమగిరి చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గంజాయి తీసుకుంటున్న ఆయా వ్యక్తు లను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ గోపాల్‌రావు తదితరులున్నారు.

కన్నకొడుకే కాల యముడు

- పెందుర్తి పీఎస్ పరిధి నరవలో దారుణహత్య
- తండ్రిని కత్తితో నరికి చంపిన కుమారుడు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కొడుకు చేతిలో హతమైన దేముడు

పెందుర్తి(విశాఖ): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. కన్నకొడుకే కాలయముడై తండ్రిని నరికి చంపాడు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నరవ శివారు మనిపాలెంలో ఎంగలి దేముడు(60) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. దసరా నేపథ్యంలో కొద్ది రోజులుగా కుమారుడు గోపితో కలిసి తరచూ మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇంటికి వచ్చి పడుకున్న తండ్రి గొంతును కత్తితో కొడుకు కోసేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై దేముడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. నిందితుడు గోపిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు అశోక్‌రెడ్డి కాలువలో పడి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం సంఘటన జరగగా మంగళవారం ఉదయం బయటపడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసుల వివరాలు మేరకు.. పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన జి.అశోక్‌రెడ్డి (29) సింటర్ ప్లాంట్‌లో టీఎంసీ కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అనారోగ్యం నుంచి కోలుకొని సోమవారం బీ షిఫ్ట్ విధులకు హాజరై సాయంత్రం 7 గంటల సమయంలో బైక్‌పై బయల్దేరాడు. అక్కడ ఉన్న కల్వర్ట్ పరిసర ప్రాంతం బురదగా ఉండటంతో బైక్ స్కిడ్ అయి పక్క ఉన్న కల్వర్ట్‌లో జారి పడిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. సీఐ కేశవరావు, సిబ్బంది సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించారు. మృతిని శరీరంపై గాయాలున్నట్టు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వరిలో కాండం తొలిచే పురుగు నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉన్నందున కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, లేదా ఎకరాకు 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను వేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4 కిలోల క్లోరాంత్రనిలిప్రోల్ గుళికలను 8 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. సుడిదోమ ఆశించినట్లయితే నివారణకు పొలం నుంచి నీటిని బయటికి తీసివేయాలన్నారు. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టి, తర్వాత డైనోటో ఫ్యురాన్ 0.4 గ్రాముల లేదా ట్రిఫ్లూమిజోఫైరిం 0.48 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందని, తెగులు నివారణకు అజోక్సిస్ట్రోబిన్ 1 మి.లీ. లేదా ఆజోక్సిస్ట్రోబిన్, టెబుకొనజోల్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని చెప్పారు. దుబ్బు చేసే దశలో వరి పైరుకు 23 కిలోల యూరియాను పై పాటుగా వేసుకోవాలన్నారు. చెరకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తిచేసే పేను బంక పురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు కిలో మల్టికెను పిచికారీ చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు కందిలో వడలు తెగులు ఆశించవచ్చని, నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వర్ష సూచన ఉన్నందున, తేమను ఉపయోగించుకుని రబీ పంటలు వేసేందుకు నేల తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వి.గౌరీ, బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.